క్లుప్తంగా

యోగాతో ఆరోగ్యం



తాడూరు: యోగాతో ఆరోగ్యమని హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పాఠశాలలో విద్యార్థులకు యోగాపై ఆసక్తి కలిగే విధంగా ప్రతి శనివారం యోగాపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. అలాగే విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలనే ఉద్దేశ్యంతో బాలసభ, వివిధ రకాలైన సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు.

యాదిరెడ్డిపల్లిలో బోరు ప్రారంభం



తాడూరు: మండలంలోని యాదిరెడ్డిపల్లిలో పల్లె ప్రకృతివనం, శ్మశానవాటికకు దగ్గరలో వేసిన కొత్త బోరును ఎంపీడీఓ గంగమోహన్, సర్పంచ్ ప్రవీణ్‌రెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన పైప్‌లైన్ ఏర్పాటు చేసి వేసిన బోరు నుంచి పల్లెప్రకృతి వనంతో పాటు నర్సరీకి నీరు అందించాలన్నారు. నర్సరీలోని వివిధ రకాల మొక్కలను అందుబాటులో ఉంచాలని పంచాయతీ సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రతి రోజు నర్సరీలో పెంచుతున్న మొక్కలకు నీరు అందే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఆంగ్ల భాషపై పట్టు సాధించాలి

ఉప్పునుంతల: విద్యార్థులు చిన్నప్పటినుంచే ఆంగ్ల భాషపై పట్టు సాధిస్తే ఉన్నత చదువులో ఎలాంటి ఇబ్బందులు ఉండవని స్థానిక బాలుర ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు బాలమణి, వెంకటేష్ సూచించారు. శుక్రవారం స్థానిక పాఠశాలలో విద్యార్థులకు ఆంగ్ల పదాల స్పెల్లింగ్ క్విజ్ పోటీలు నిర్వహించారు. అనంతరం గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేసి ప్రోత్సహించారు.

విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ



పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ ప్రభుత్వ పాఠశాలలో 5వ తరగతి గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్షలు రాసే విద్యార్థులకు యువర్ డ్రీం ఇట్స్ మై రెస్పాన్సిబులిటీ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు శుక్రవారం మెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మద్దిలేటి, పద్మ, శివకుమార్, ఈశ్వర్, రాజు పాల్గొన్నారు.

కేఎల్‌ఐ కాల్వకు మరమ్మతు



కోడేరు: మండలంలోని ముత్తిరెడ్డిపల్లి గ్రామ శివారులో గత వారం రోజుల క్రితం తెగిపోయిన కేఎల్‌ఐ కాల్వకు డీఈ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మరమ్మత్తు చేపట్టారు. రెండు రోజుల్లో రైతులకు సాగునీరు అందిస్తామన్నారు. కాల్వ తెగిపోవడంతో కోడేరు, పాన్‌గల్లు మండలాలకు సాగునీరు నిలిచిపోయింది. అధికారులు స్పందించి మరమ్మత్తులు చేపట్టి కాల్వల ద్వారా సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

పత్తిని రూ.12వేలకు కొనుగోలు చేయాలి



కొల్లాపూర్: రైతులు పండించిన పత్తి పంటను క్వింటాకు రూ.12 వేల చొప్పున చెల్లించి ప్రభుత్వం కొనుగోలు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు శుక్రవారం ఆర్డీఓ హనుమనాయక్‌కు వినతి పత్రం అందజేశారు. రైతులు పండించిన పత్తి పంటకు సరైన గిట్టుబాటు ధర లేకపోవడంతో పంటను ఇళ్లలోనే దాచుకున్నారని వివరించారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి శివవర్మ, నాయకులు సలీమ్, మహిమూద్, రామకృష్ణలున్నారు.

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ

నాగర్‌కర్నూల్‌రూరల్: మండల పరిధిలోని కుమ్మెర జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయులై తమ తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. శుక్రవారం పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. జీహెచ్‌ఎం సత్యశీలా రెడ్డి ఉపాధ్యాయులు ధనుంజయ్, కృష్ణ, మధు, మద్దిలేటి, వెంకట్రాములు, సుధాకర్‌రెడ్డి, శ్రీను, రామూర్తి, లింగారెడ్డి పాల్గొన్నారు.

దోమలపెంట (అచ్చంపేట): దోమలపెంటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయుల పాత్రలో ఆకట్టుకున్నారు. డీఈఓ పాత్రలో తేజ, హెచ్‌ఎంగా కావ్య, ఆర్జేడీగా దినేష్ వ్యవహరించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు హెచ్‌ఎం నాగయ్య బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బి.మల్లికార్జున్, సర్పంచ్ శారద, ఉపాధ్యాయులు శంకర్, ఈశ్వర్, శిరీష, స్టెల్లా, మల్లయ్య, శ్రీనివాస్, శ్రీధర్ పాల్గొన్నారు.

అచ్చంపేట రూరల్: మండలంలోని నడింపల్లి ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు ఛాత్రోపాధ్యాయులుగా వ్యవహరించారు. తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ప్రతిభ కనబర్చిన చిన్నారి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సామ్యానాయక్, జమాలుద్దీన్, శంకరయ్య, శ్రీశైలం, జయమ్మ, వాలంటీర్లు పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి: మండలంలోని పెద్దకార్పాముల ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అంజయ్య, ఎస్ఎంసీ చైర్మన్ ఎండీ ఖలీల్, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, సుదర్శన్, గోపాల్, మహ్మద్, సత్యనారాయణ, అర్చన, ప్రభావతమ్మ, డాక్య నాయక్ పాల్గొన్నారు.



నడింపల్లి ప్రాథమిక పాఠశాలలో ఛాత్రోపాధ్యాయులతో ఉపాధ్యాయులు



దోమలపెంటలో విద్యార్థులతో ఉపాధ్యాయులు



కుమ్మెరలో ఉపాధ్యాయులైన విద్యార్థులు

ఉపాధి పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



షాపులు పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న సభ్యులు

తాడూరు: ఉపాధి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఐకేపీ ఏపీఎం తిరుపతయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని మేడిపూర్, చర్ల ఇటిక్యాల, ఐతోల్ గ్రామాలలో స్వయం ఉపాధి ద్వారా రుణాలు పొందిన వారి జీవన విధానాల్లో ఎలాంటి మార్పులు వచ్చాయనే పలు అంశాలపై కౌన్సిల్ ఫర్ సోషల్ డెవలప్‌మెంట్ పరిశోధన సంస్థకు చెందిన సభ్యులతో పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యాపారాలను మెరుగు చేసుకునేందుకు సూచనలు, సలహాలు చేశారు. మహిళలు ఆర్థిక చైతన్యం సాధించి రాష్ట్రాభివృద్ధిలో తోడ్పడాలన్నారు. కార్యక్రమంలో సభ్యులు డి.సుందర్‌రాజు, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహులు, తిరుపతయ్య, నాగరాజు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌ను సవరించాలి



కోడేరు: కేంద్ర బడ్జెట్‌ను సవరించాలని రైతు సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ 2023–24 ఆర్థిక సంవత్సరం కోసం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను కార్పొరేట్‌కు బేరులో సంపన్నుల కోరిక మేరకు రూపొందించినట్లుగా ఉందన్నారు. బడ్జెట్ రైతులు, పేదలు, కార్మికులకు ప్రయోజనాలకు విరుద్ధంగా ఉందన్నారు. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధికి బడ్జెట్ కేటాయింపులు తక్కువగా ఉన్నాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శివశంకర్, సాయిలు, కుర్మయ్య, వెంకట్‌రెడ్డి, నర్సింహ పాల్గొన్నారు.

ముదిరాజ్‌ల హక్కులను సాధించుకోవాలి

వెల్దండ: ముదిరాజ్‌లు ఐక్యంగా ఉండి హక్కులను సాధించుకోవాలని ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు మల్లేష్‌ముదిరాజ్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రాచూర్‌లో ముదిరాజ్‌నాయకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం రాచూర్‌లో ముదిరాజ్ గ్రామ కమిటీని మండల అధ్యక్షుడు మల్లేష్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా గందారి శ్రీశైలంముదిరాజ్, ఉపాధ్యక్షుడిగా రాస్కె నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా రమేష్‌ముదిరాజ్, కోశాధికారిగా శ్రీశైలం, శేఖర్, సహాయకార్యదర్శిగా యాదగిరిలతో కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఉన్నారు. కార్యక్రమంలో మండల ముదిరాజ్ సంఘం నాయకులు కృష్ణముదిరాజ్, ఎర్ర శ్రీను ముదిరాజ్, శ్రీనివాసులు, బాల్‌రాజు, గణేష్, రమేష్, శ్రీశైలం, బాలకృష్ణ, జంగయ్య, కృష్ణయ్య ఉన్నారు.

ముగిసిన విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు



విగ్రహ ప్రతిష్ఠాపనలో జిల్లా వైద్యాధికారి

లింగాల: మండల కేంద్రానికి సమీపంలోని చెన్నంపల్లి వెళ్లే మార్గంలో ఉన్న శివాలయంలో గత మూడు రోజుల పాటు మహాగణపతి, నందీశ్వర విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. చివరి రోజు ఆలయం ఆవరణలో వేద మంత్రోచ్చరణల మధ్య మహాగణపతి, నందీశ్వర విగ్రహాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. మహోత్సవాలకు భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. పురాతనమైన ఈ ఆలయంలో మహాశివరాత్రి రోజు శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. భక్తులకు సౌకర్యార్థం అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ లింగమ్మ, సర్పంచ్ తిరుపతయ్య, జిల్లా వైద్యాధికారి సుధాకర్‌లాల్ పాల్గొన్నారు.

పెళ్లిళ్ల సీజన్‌లో రాయితీపై ఆర్టీసీ సేవలు

అచ్చంపేట రూరల్: పెళ్లిళ్ల సీజన్‌లో టీఎస్ ఆర్టీసీ అద్దె బస్సులపై 10శాతం రాయితీ కల్పిస్తున్నామని, ఈ అవకాశం జూన్ 30వరకు వర్తిస్తుందని అచ్చంపేట ఆర్టీసీ డీఎం రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. పెళ్లిళ్లు, శుభ కార్యాలకు అద్దె బస్సులపై ప్రత్యేక రాయితీని కల్పిస్తున్నామన్నారు. గతేడాది డిసెంబర్ 31వరకు రాయితీ ముగిసినా తాజాగా పెళ్లిళ్ల సీజన్ కావడంతో డిమాండ్ దృష్ట్యా 10 శాతం రాయితీని సంస్థ మరోసారి ప్రకటించిందని తెలిపారు. ప్రైవేటు వాహనాల కంటే తక్కువ ధరకే బస్సులను అద్దెకు ఇస్తున్నామన్నారు. ముందస్తుగా ఎలాంటి నగదు డిపాజిట్ లేకుండానే సదుపాయం కల్పిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బీజేపీ కార్యకర్తల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

పెద్దకొత్తపల్లి: రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలని కోరుతూ బీజేపీ ఆధ్వర్యంలో స్థానిక సబ్‌స్టేషన్ వద్ద శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండలాధ్యక్షుడు భీమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 9 గంటలు కూడా కరెంటు ఇవ్వడం లేదని అన్నారు. గత 4 రోజుల నుంచి వ్యవసాయ పొలాలకు 2 గంటలు మాత్రమే విద్యుత్ సరఫరా చేస్తున్నారు. త్రీఫేస్ కరెంట్ ఇవ్వకపోతే బస్టాండ్‌లో పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేస్తామని విద్యుత్ ఏఈకి బీజేపీ కార్యకర్తలు వినతిపత్రం అందజేశారు. మూడు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. కార్యక్రమంలో వెంకటయ్య, మల్లేశ్, తిరుమల్, వెంకటస్వామి, కృష్ణయ్య, పరుశరాం, శేఖర్, గోపాల్, నాగరాజు, కుర్మయ్య, రాముడు, శివ, ప్రకాశ్, శరత్ పాల్గొన్నారు.

నిరుద్యోగులకు నిరాశే

కొల్లాపూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ నిరుద్యోగులకు తీవ్ర నిరాశ మిగిల్చిందని మాజీ టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ రంగినేని జగదీశ్వరుడు అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చే హామీల మాదిరిగా బడ్జెట్ ఉందన్నారు. వాస్తవానికి పొంతన లేకుండా బడ్జెట్ రూపొందించారని ఆయన ఆరోపించారు. బడ్జెట్‌లో నిరుద్యోగ భృతి అంశాన్ని విస్మరించారన్నారు.

బీసీలను పట్టించుకోలేదన్నారు. రజకులు, వడ్డెరులు, కుమ్మరి, కమ్మరి, మాదాసీ కురువలు, వాల్మీకి బోయలు, నాయీబ్రాహ్మణులతో పాటు పలు కులవృత్తిదారుల సంక్షేమాన్ని ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు.

హమారా ప్రసాద్‌ను అరెస్టు చేయాలి

కొల్లాపూర్: ట్విట్టర్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హమారా ప్రసాద్‌ని వెంటనే అరెస్టు చేయాలని మాలల చైతన్య సమితి నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దళితులు, అణగారిన వర్గాల ఆరాధ్యుడైన అంబేద్కర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు తగవన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాందాసు, ఎర్ర శ్రీనివాసులు, వెంకటస్వామి, సురేందర్, మూర్తి, కుమార్ తదితరులున్నారు.

విద్యార్థినులకు యూనిఫాం పంపిణీ



లింగాల: మండల కేంద్రంలోని బాలికల మినీ గురుకుల పాఠశాల విద్యార్థినులకు శుక్రవారం ప్రభుత్వం నుంచి సరఫరా అయిన యూనిఫాం పంపిణీ చేశారు. యూనిఫాంతో పాటు కార్పెట్స్, స్కూల్ బ్యాగ్‌లు, ఐడీ కార్డులు పంపిణీ చేశారు. అలాగే విద్యార్థినుల తల్లిదండ్రులకు రూ.1,050 నగదును అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శారద, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

లింగాల: మండల పరిధిలోని చెన్నంపల్లికి చెందిన మూడావత్ గోబ్రియా శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందగా మృతుడి కుటుంబాన్ని మండల యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్ రాథోడ్ పరామర్శించారు. అనంతరం రూ.4 వేల ఆర్థిక సహాయంతో పాటు 25 కిలోల బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో చెన్నంపల్లి, దారారం కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

బిజినేపల్లి: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని మాజీమంత్రి నాగం జనార్దన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తిమ్మాజీపేట మండలంలోని పోతిరెడ్డిపల్లిలో హాథ్ సే హాథ్ జోడో అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యావసరాలకు అధిక ధరలు పెంచారని, వ్యవసాయ సబ్సిడీలను సైతం తొలగించారన్నారు. ఈ మేరకు గ్రామస్తులు పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. అనంతరం పాతిరెడ్డిపల్లిలో పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు అర్థం రవి, నాగం శశిధర్‌రెడ్డి, వెంకట్రాంరెడ్డి, కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

పెంట్లవెల్లి: మండల పరిధిలోని మల్లేశ్వరంలో హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా శుక్రవారం ఆయన గ్రామంలో యాత్ర నిర్వహించి కాంగ్రెస్ జెండా ఆవిష్కరణ నిర్వహించారు. అనంతరం ఆయన గడపగడప తిరుగుతూ గతంలో కాంగ్రెస్ చేసిన సంక్షేమ పథకాలు, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే చేసేటువంటి పథకాలను తెలియజేశారు. వచ్చే ఎన్నికల్లో కొల్లాపూర్‌లో కాంగ్రెస్ జెండా ఎగరవేస్తామని ఆయన ప్రజలతో ముచ్చటించారు. కార్యక్రమంలో వనపర్తి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు, శ్రీలతారెడ్డి, పెంట్లవెల్లి మండల అధ్యక్షుడు నరసింహయాదవ్, భీరయ్య, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు నరసింహనాయుడు, డిష్ రవి, ఈశ్వరయ్య, సుధాకర్, కిరణ్, రామకృష్ణ, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



మల్లేశ్వరంలో వృద్ధురాలికి పథకాలను వివరిస్తున్న ప్రధాన కార్యదర్శి అభిలాష్‌రావు

ముస్తాబైన శివాలయం

- శివస్వాములకు ప్రత్యేక ఏర్పాట్లు
- 14నుంచి అన్నదాన కార్యక్రమాలు

దోమలపెంట(అచ్చంపేట): దోమలపెంటలోని శివాలయాన్ని శివరాత్రి కోసం ఆలయ నిర్వాహకులు సుందరంగా ముస్తాబు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి పాదయాత్ర ద్వార శ్రీశైలానికి వచ్చే శివస్వాములు శివాలయంలో సేద తీరి, తెల్లవారు జామున స్నానమాచరించి పూజలు చేసుకుని శ్రీశైలంకు పాదయాత్ర ప్రారంభిస్తారు. స్థానికంగా ఉన్న ఇతర ఆలయాల్లో కూడ స్వాములు సేదతీరుతారు. కాగా శివాలయంలో శివరాత్రికు ముందు 14వ తేది నుంచి 16 వరకు స్వాములకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక శైవ భక్తుడు జంగయ్య గత పంతొమ్మిదేళ్ల నుంచి చేస్తున్నారు. గ్రామంలోని దాతలతో పాటు ఇతర ప్రాంతాల్లోనున్న దాతల సహకారంతో చేస్తున్నట్లు తెలిపారు. ఉదయం ఏడు నుంచి పది గంటల వరకు అల్పాహారం, తదుపరి పది గంటల నుంచి సాయంత్రం వరకు ఆలయంలో అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు అధికంగా పాల్గొని శ్రమదానం చేస్తారు.



దోమలపెంటలోని శివాలయం

బండలాగుడు పోటీలు భేష్

బిజినేపల్లి: ఆనందగిరి శ్రీలక్ష్మీ నర్సింహాస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా మండల కేంద్రంలో జాతీయ స్థాయిలో ఏర్పాటు చేసిన ఒంగోలు జాతి వృషభరాజుల జాతి బండలాగుడు పోటీలు అద్భుతంగా నిర్వహిస్తున్నారని మాజీమంత్రి నాగం జనార్దన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బిజినేపల్లిలో నిర్వహిస్తున్న బండలాగుడు పోటీలను తిలకించడానికి నాగం జనార్దన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ బాలీశ్వర్ నాగంను ప్రత్యేకంగా సన్మానించి పోటీల ప్రాముఖ్యత, విశిష్టతను వివరించారు. అనంతరం బండలాగుతున్న వృషభరాజులను నాగం ప్రత్యేకంగా పరిశీలించి పోటీలను తిలకించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మిద్దెరాములు, మండల కాంగ్రెస్ నాయకులు కత్తె ఈశ్వర్, నెల్లికంటి గోపాల్‌రెడ్డి, వాల్య, పండ్ల పాష, భరత్‌గౌడు తదితరులు పాల్గొన్నారు.



మాజీమంత్రి నాగంను సన్మానిస్తున్న సర్పంచ్

పత్తి పంట పరిశీలన

బిజినేపల్లి: సాగునీటి సౌకర్యం ఉంటే యాసంగి పంటగా పత్తిని సాగు చేసి మంచి దిగుబడులను ఆశించవచ్చని ఏఓ కమల్‌కుమార్ అన్నారు. శుక్రవారం తిమ్మాజీపేట మండలంలోని ఇప్పలపల్లిలో రైతు పాండురంగారెడ్డి యాసంగిలో సాగు చేసిన పత్తిని క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ యాసంగి ప్రారంభమయ్యే సమయానికి నేలను చదును చేసి పత్తి విత్తనాలు విత్తుకుంటే పత్తి తీత సమయానికి చీడపీడలు లేకుండా అధిక కాయతో పత్తిలో అధిక దిగుబడిని ఆశించడమే కాకుండా అధిక ధరను కూడా అందుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఈఓ, రైతులు పాల్గొన్నారు.



పత్తిని పరిశీలిస్తున్న అధికారులు

ఉపకార వేతనాలు మంజూరు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

అచ్చంపేట రూరల్: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ నాయకుడు ఉదయ్‌కిరణ్ డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ కృష్ణయ్యకు వినతిపత్రం అందజేశారు. ఉపకార వేతనాలు ప్రభుత్వ భిక్ష కాదని, విద్యార్థుల హక్కు అని అన్నారు. ప్రభుత్వ మొండి వైఖరితో పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు చందు, మధు, భరత్, సోహెల్, బాలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

లింగాల: మన ఊరు–మన బడి మొదటి దశలో ఎంపికైన మండలంలోని దత్తారం ప్రాథమిక పాఠశాలను శుక్రవారం స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం తాహెర్‌పాష సందర్శించి పనులను పరిశీలించారు. ఈనెల 20న ప్రారంభం చేయనున్నట్లు, పెండింగ్ పనులను సత్వరంగా పూర్తి చేయించాలని హెచ్‌ఎం నస్రీమ్ బేగంకు సూచించారు. అదేవిధంగా జీల్లుపల్లి పాఠశాలను సందర్శించిన ఆయన విద్యార్థుల హాజరు శాతం, మధ్యాహ్న భోజనం అమలును పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నరేష్, సీఆర్పీ విష్ణు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న కాంప్లెక్స్ హెచ్‌ఎం తాహెర్‌పాష

ఎకోపార్క్ పనుల పరిశీలన



పరిశీలిస్తున్న ఫారెస్టు ఉన్నతాధికారులు

కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని సోమశిల గ్రామ సమీపంలో ఫారెస్టులో గట్టుపై ఫారెస్టు నిధులతో నిర్మాణం చేస్తున్న ఎకోపార్క్ పనులను శుక్రవారం ఫారెస్టు ఎఫ్‌డీఓలు నవీన్ రెడ్డి, శ్రీనివాసులు సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పనులు నాణ్యతగా చేయాలన్నారు. కార్యక్రమంలో రేంజర్ పద్మమరావు, అధికారులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'కంటి వెలుగు'



తాడూరులో పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ అఖిలేష్

తాడూరు: మండల కేంద్రంతో పాటు పీహెచ్‌సీ పరిధిలోని కుమ్మెరలో కంటి వెలుగు పరీక్షా కేంద్రం కొనసాగుతోంది. శుక్రవారం రెండు కేంద్రాల్లో కలిపి 340 మందికి పరీక్షలు నిర్వహించినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. ఈ సందర్భంగా పరీక్షలు చేయించుకోవడానికి వచ్చే వారికి అన్ని సౌకర్యాలు కల్పించామని, అవసరమైన వారికి అద్దాలు, ఆపరేషన్లకు అవసరమైన వారిని గుర్తించి జాబితాను తయారు చేస్తున్నామన్నారు.

కల్వకుర్తిరూరల్: స్థానిక రఘుపతిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మూడు శిబిరాల ద్వారా శుక్రవారం 643 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో కంటి సమస్యలు ఉన్న వారిని గుర్తించి 86 మందికి కంటి అద్దాలు అందజేశారు.



కల్వకుర్తిలో..